# భోజనం

## పురాణం సుబ్రహ్మణ్య శర్మ*

బిల్లు కట్టలేదని ఎలక్ట్రీవాళ్ళు ఫ్యూజ్ తీసేశారు. పాతగుడ్డ చింపి మెలిపెట్టి వత్తిచేసి కోడిగుడ్డుదీపం వెలిగించింది పార్వతి. గిన్నెలో మిగిలిన మధ్యాహ్నం అన్నం పిల్లలకు వూడ్చిపెట్టేసి గ్లాసుడు గ్లాసుడు మంచినీళ్ళిచ్చి వాళ్ళను చాపేసి పడుకోబెట్టింది కిటికీలోంచి చాపమీద పడిన వెన్నెల పిల్లల మొహాలమీదుగా పాకుతోంది. కొబ్బరిమట్టలు గాలికి ఊగిస లాడ్తున్నాయి. ఆ ఆకుల్ని చీల్చుకువచ్చిన కిరణాలు సావిట్లో తారట్లాడటం చూస్తో తలుపుకి జారగిలబడి కళ్ళుమూసుకుంది.

శ్రావణమంగళవారం పేరంటానికి వెళ్ళి తెచ్చిన శనగలు సాతాళించి బూర్ల మూకుడు గిన్నెమీద కప్పెట్టి వచ్చి కూర్చుంది. అవి పిల్లల కళ్ళబడకుండా దాచిపెట్టాననే సంతృప్తి ఆమెకు లేదు. చమురు లేక వత్తి మండిపోయి చిమ్నీ అంతా నల్లగా గారకట్టి అసహ్యంగా వుంది. కాంతిని చిమ్మలేక చీకటితో పోరాడలేక అసహ్యంగా వెలుగుతోంది. పార్వతి వంటిమీద ఆకుపచ్చ చీర దయ్యంలా బరువుగా దిగలాగేస్తోంది. గొంతుకలో చిన్నప్పుడు నేర్చుకున్న పాట బయటపడ్డానికి కొట్టుకుంటోంది.

ఆ కూనిరాగం వింటూ సుబ్బారావు చెక్కపెట్టి ముందేసుకు కూర్చుని టి. ఏ. బిల్సు చేసుకుంటున్నాడు. ఆ బల్లమీద రైటింగ్‌పాడ్ పెట్టి గోడకు జార్లబడి రైల్వేకాగితాల మీద కూడికలు తీసివేతలు చేస్తూ అన్నం మర్చిపోయి ఆడుకుంటున్న వెర్రిపిల్లాళ్ళా రాసుగుంటున్నాడు.

కూనిరాగం కట్టిపెట్టి పార్వతి లేచి సాతాళించిన శనగల్ని సిల్వర్ పళ్ళెంలో పోసి పట్టుకొచ్చి కొవ్వొత్తి దీపం నీడలో పెట్టి 'తినండి' అన్జెప్పి గాజు గ్లాసులో మజ్జిగపోసి అందులో బాగా నీళ్లు కలిపి ఉప్పేసి పట్టుకొచ్చింది.

అతను ఓ గుప్పెడు తీసుకుని ఒక టొకళే నోట్లో వేసుగుంటూ 'ఇ వెక్కడివే - ఇవి చాలా బాగున్నాయ్' అని మెచ్చుగుంటూ భార్యకేసి చూసి 'ఇంద నువ్వు కూడా తిను' అని పళ్ళెం చేత్తో ఎత్తి ఆమె మొహంలోకి చూశాడు.

అక్కడావిడ మొహం కనిపించడం లేదు. ఆకుపచ్చ చీర తన ముందు తిష్ట వేసి కూర్చున్నట్లుంది. కొవ్వొత్తి దీపం ప్రసరించిన వెల్తురంతా పోటీపడి ఆమె వొళ్లో చేరి ఆడుకుంటున్నట్లుగా వుంది.

అతను మళ్ళీ టి. ఏ. బిల్సు చెక్‌చేసుకోవడంలో మునిగిపోయాడు. పార్వతి మునివ్రేళ్ళతో నాలుగు గింజలు తీసి నోట్లో వేసుకొంది. అవి గొంతుక దిగ లేదు. అమ్మ పేరంటానికి వెళ్ళి తెచ్చిన శనగలు వేయించి పెడుతుంది అని ఆశ పడ్డ పిల్లలు మంచినీళ్ళు తాగి చాపమీద పడుకుని నిద్రపోతున్నారు. ఈ శనగలు లోపలకి వెళ్ళడం లేదు. ఒక గుప్పెడు శనగలు తీసుకుని నిద్రపోతున్న చిట్టిని ఎత్తుకుని పెరట్లోకి తీసుకెళ్ళి గుంజి గుంజి తినమని బలవంతపెట్టి నోట్లో పోసింది. పార్వతికి అప్పుడో చిన్న గుబులొచ్చింది. అది తగ్గేదాకా మెట్లమీద కూర్చుని ఏడ్చింది. లేచివెళ్ళి పిల్లను పడుకోబెట్టి మధ్యాహ్నం ఎవరో పట్టుకొచ్చి ఇచ్చిన పెళ్ళి శుభలేఖను తెచ్చి సుబ్బారావు ముందు పడేసి దగ్గరకొచ్చి కూర్చుంది.

కుచేలుడి లాటి సుబ్బారావుకి కృష్ణుడి లాడి స్నేహితుడున్నాడు. అది కృష్ణారావు పెళ్ళి శుభలేఖ. ఆ శుభలేఖ చూడగానే సుబ్బారావు మొహం వికసించింది.

'వెళ్ళండి పెళ్ళి భోజనం చేసిరండి.'

అప్పుడే శనగల పళ్లెమూ మజ్జిగగ్లాసు ఖాళీచేసిన సుబ్బారావు గతుక్కుమన్నాడు.

తను భోజనం గురించి ఆలోచిస్తున్నట్లు పార్వతి కెలా తెలుసు?

కొవ్వొత్తి సగంపైగా కాలిపోయింది.

వంటింట్లో కోడిగుడ్డు దీపం ఎప్పుడో కొండెక్కింది.

శుభలేఖను తీసుకుని తిరగేసి బోర్లేసి చూసి ఫక్కుమని నవ్వేసింది.

సుబ్బారావుకి కొంచెం కోపం వచ్చింది.

'ఎందుకట్లా నవ్వుతావు పిచ్చిదానిలా?'

పార్వతి మాట్లాడలేదు. ఇంట్లోవున్న ఒకే ఒక పాతపత్రికను తెచ్చుకుని పేజీలు తిరగేస్తూ కూర్చుంది. ఎప్పుడూ ఆ బొమ్మలే చూస్తూ వుంటుంది. చదివినవే మళ్ళీ చదువుతూ వుంటుంది.

'పెళ్ళికి ఏంపట్టుకెళ్తారు? వుత్తి చేతుల్తో వెళ్తారా—' అని యిందాట్లా నవ్వినందుకు సంజాయిషీ చెప్పుకుంది.

'పిల్లల్నికూడా తీసుకెళ్ళండి' అని తలవంచుకుంది.

టప్‌టప్‌మని పుస్తకంమీదకు, కన్నీరు చిందించి కాగితాలు కట్టకట్టి చెక్కపెట్లో తోసివచ్చి పెళ్లాం మెళ్ళో తలకాయ



పెట్టుకుని నడుంచుట్టూ చేతులేసి నేలమీద పడుకున్నాడు అనంతపద్మనాభస్వామిలా.

'ఏవిటీ మొగుడు? ఇదేవిటి సంసారం? ఎందుకీ ఆఫీసు కాగితాలు ముందేసుకు కూర్చోడం? నువ్ తిన్నావా అనిఅడగడే? వంట చేశావా లేదా అనైనా అడగొచ్చు కదా! పిల్లలు తిన్నారోలేదో ఆకల్తో పడున్నారో అనైనా పట్టించుకోడేం? ఇది అమాయకత్వమా - తెలివి తక్కువ తనమా - మూర్ఖత్వమా లేక చేతకాని తనమా? ఇలాగైతే యీ బండెలా నడుస్తుంది? ఈ పడవ ఎలా ఒడ్డెక్కుతుంది? ఈ బ్రతుకులు ఎలా తెల్లవారుతాయి? ఈ పిల్లలేమవుతారు? భోజనం తరవాతే కదా, ఏ సుఖమైనా సంతోషమైనా-భోజనానికే లేకపోయాక జీవితంలో యింకేం భోగం, ఏంఆనందం, ఏంశాంతి?' యిలా ఆలోచించుకుంటూంటే పార్వతికి ముచ్చెమట్లు పోశాయి.

కొవ్వొత్తి కాలికాలి ఆరి ముద్దయి కూర్చుంది.

పార్వతి వుత్త సినిక్ అనుకున్నాడు సుబ్బారావు. అజ్ఞానురాలు. అజ్ఞానులు ఆడవాళ్ళు తిండిగురించే ఆలోచిస్తారు. పూర్ క్రిచర్ - భోంచేసినట్లులేదు. మజ్జిగ అంతా నాకే ఒంపేసింది. మంచినీళ్లు తాగి వున్నట్లుంది. దీన్నేమీ అనకూడదు. రేపెలా వెళ్ళడం పెళ్ళికి ?

సుబ్బారావుని అసింటా నెట్టి ఆ చీకటింట్లో అలాగే చెంగుపర్చుకుని ఒరిగింది పార్వతి కొంచెం సేపయాక సుబ్బారావు దొర్లుకుంటూ వచ్చి చీర పుచ్చుకు గుంజాడు.

'ఛీ! అవతలకిపొండి.' అని ఆ చేతిని విసిరికొట్టింది. ఆడదానికి అభిమానం హెచ్చు, మొగాడికి మొహమాటం హెచ్చయితే యిలాగే వుంటుంది సంసారం? కొంచెం బింకంగా వుంటేసరి. ఏది బింకమో తెల్లారిలేవంగానే బియ్యం డబ్బా తెచ్చి బోర్లించి చప్పుడు చేస్తుంది గావును. చేట పుచ్చుకుని బయలుదేరడం దానికి కష్టంగానే వుండొచ్చు. అసింటా జరుగుదునా-నిద్రలో ఫెడీల్మని ఓటిచ్చుగుంటే దొంగదెబ్బ కాసుకోవడం కష్టం! మనిషి ఎలావుండేది? 'చిన్నాది పూదేనెరా కవటాకులో యీనెరా!' అన్నట్లుండేది. నేలమీద చెంగుపర్చుకుని పడుకుంది. నేను చూళ్లేను...ఎత్తి మంచంమీద పడుకోపెడుదునా—(నాకెందుకు నేలనున్నది నెత్తికి రాసుకోడం) కళ్ళు మూసుకు పోతున్నాయి. ఎవరికెవరూకారు! కళ్ళు మూసుగుంటె యీ ప్రపంచం మందికాదు కడుపులో చీకటి కన్నుమూస్తే చీకటి కన్ను తెరిస్తే చీకటి-కలలకి కరువులేదు. పార్వతికి కలలొచ్చాయి-కలలన్నీ తిండి గురించే...గుండిగల్తో పువ్వులాటి అన్నం వండి వార్చినట్లు కలలు. పళ్ళేలతో విస్తళ్ళలో అన్నం వడ్డిస్తూన్నట్లు-జనం బారులుతీర్చి ఆరగిస్తున్నట్లు-ఆ జనంలో తన మొగుడూ పిల్లలూ ఎక్కడున్నారో తెలీక గుండె కొట్టుకొంటుంది. చేతిలో పళ్ళెం క్రిందపడిపోయింది. అన్నం పళ్ళెం పడిపోయినందుకు గాబరా పడిపోయి మెలకువొచ్చింది. లేచి మంచినీళ్ళు తాగి వచ్చి మొగుడిమీద చెయ్యేసుకు పడుకుంది. సుబ్బారావు యిటు తిరిగి నిద్రలో వాటేసుగున్నాడు. భోజనమూ నిద్రా నిద్రలో కలలూ కలల్లో కోరికలూ యివి

తప్పవల్లేవుంది. సుబ్బారావు గుప్పిట్లోకి చీర వచ్చేసింది.

నిన్నా మొన్నా భోజనం చేశారు కాదా-ఆ అన్న శక్తి వూరుకుంటుందా? శనగలు తిని మజ్జిగ తాగినా మంచినీళ్లు త్రాగి పడుకున్నా తర్వాత గొప్ప సుఖం నిద్రే-ఆ నిద్రలో 'ఏమాయె నేమాయెనే' అని కలవరించింది పార్వతి.

* * *

దుర్గ సన్నగా సళాకులా వుంటుంది. పిల్ల నల్లబంగారమే-బుర్ర నున్నగా దువ్వుతుంది. అర్ధణా అణా కొబ్బరినూనె పట్టొచ్చు. దాని మొగుడు కొబ్బరి నూనెకు డబ్బు లివ్వడు. సబ్బుబిళ్ళ కొనివ్వడు కోకలు వాడే కొనిచ్చానంటాడు. అది కొనివ్వలేదు-మావోడు ఒట్టి అబద్ధంగాడంటుంది. దాని ముక్కు అందంగా ఉంటుంది. అది మొగుడు కొట్టినపుడు ఎగబీల్చడానికి ఉపయోగిస్తుంది. ఒంటిరాయి ముక్కుపుడక ఉంది. దాని కాళ్లకు వెండిపట్టా లున్నాయి. అది మాట్నీలకు పోతుంది. ప్రతి 'చినేమా' అది చూడాల్సిందే-నా పొట్ట నేనే పోసుగుంటున్నానంటుంది. అది పాచిపని చేస్తుంది. అంట్లు తోముతుంది. కానిమనిషినీటుగాశుభ్రంగా ఉంటుంది. కాని యజమానురాళ్ళు దాన్ని తింగరమనిషి అంటారు ఒళ్ళుపొగరెక్కువ- మొగుడ్ని ఏడిపిస్తుంది. వాడ్ని కిర్రెక్కించి నాలుగుమాట లని తను నాలుగు దెబ్బలు తింటోవుంటుంది అని ఇల్లాళ్ళు కామెంటు చేస్తారు దాని మొగుడు కాస్త ఎర్రగా బుర్రగా ఉంటాడు. వాడి జుత్తు జులపాలు తిరిగి ఉంటుంది. వాడు కొన్నాళ్లు రిక్షాలు లాగేవాడు. దుర్గ చెడ్డ పెంకిఘటం-అది యజమానురాళ్ళతో 'చినేమా కెళ్ళి-వోసుట్టు సిన్న గమ్మత్తు కాదు కిలాడీ పజ్జేసింది.' 'ఆడి రిచ్చాలో కూకోని ఆడిచేతే నాగించి ఇంటిసందు మొగలో గాడీనోంచి గెంతీసి పారిపోనాది. 'దాని మొగుడు దాన్ని రోడ్డుమీదే చితగకొట్టేడు. అప్పట్నుంచీ వాడు రిక్షా లాగడం మానేసి బరువులు లాగుతున్నాడు. అది మారుబేరానికి కూరగాయత్తెచ్చి అమ్ముతో ఉంటుంది. పాచిపని దానికి హాబీ-బియ్యాలూ, పప్పులూ చెరిగి పావలా పరకా గుంజుతో ఉంటుంది. కొత్తగా పనిలో పెట్టుకున్న ఇల్లాళ్ళ దగ్గర రూపాయో అర్ధో అడ్వాన్సు లాగి 'సామాన్యవిజ్ఞానం' బోధిస్తో ఉంటుంది ఒకప్పు డది పిక్నికుల్లో కాలేజీ గరల్సు తోటి కలిసిపోగల్దు-మరో అప్పుడు పిల్ల సజ్జునంతా ప్రోగుచేసి పెరట్లోనో, చెట్ల క్రిందో ఆటలాడుతుంది. దాని మొగుడు దానికోసం రోజూ ఇలిల్లూ వెతుక్కుని జుట్టట్టు కీడ్చుకు పోవాల్సిందే-వాడి బండి మీద రాత్రిళ్ళది కూర్చుని 'చినేమా' పాటలు పాడ్తుంది.

బండి నానుకుని నిలబడి వాడు దాన్ని లాలిస్తూ ఉంటాడు. బనీన్లోంచి చెమటకు తడిసిన డబ్బుల్ని వాడు దాని చేతిలో పోస్తూంటాడు. అది జాగ్రత్తగాకొంగున మూట కడ్తుంది. అందులో కొంత మిగిల్చి బొడ్డున దోపుతుంది. 'వొణ్ణం' సరిగ్గా వండదని వాడు పేచీలు పెడ్తూంటాడు. 'కోకేనా కొన్నావా-రయిక సిరిగిపోనాది సూస్కో' మని అది డబాయిస్తూ ఉంటుంది. అది అంట్లు తోమినప్పుడు కంచాలలో గిన్నెలలో మిగిలిన పనికిరాని ఎంగిలి మెతుకుల్ని తూము కాలవల్లో పారబొయ్యదు. అది ఎంగిలాకుల్లో జాగర్తచేసి కుక్కలకు పెడుతుంది. ఆ సందులో రెండు మూడు కుక్కల్ని అలానే మచ్చిక చేసింది. అవి దుర్గ నేస్తాలు - చినేమా హాలుదాకా ఒకప్పుడా కుక్కలు దుర్గను వెంబడిస్తాయి. ఈ కుక్కల వలన మరో రకం కుక్కలబెడద దుర్గకు తప్పింది. కచ్చబిగించి అది యీపాటి ఆపాటి చెట్లను అవలీలగా ఎక్కేస్తుంది. చింతచెట్టు, జామిచెట్టువేపచెట్లెక్కి అది పాటలు పాడ్తుంది. మూడు నాలుగూ ఐమూ అలా అమ్మగార్ల



దగ్గర డబ్బు దాచుకుంటుంది. అది పోగు చేసుకుని కోకో రవికముక్కో కొనుక్కుం టుంది. అది కామందులిండ్లలో మెక్కేస్తూ ఉంటుంది. దాని డబ్బులెట్టి అది బియ్యం పప్పూ కొనదు. మొగుడు అరిచి గీ పెట్టినా-అడు డబ్బు తెచ్చి చేతిలోపో స్తే 'వొణ్ణం ఒండుతాది. లేకంటే లేదు.' ఆ వీధికంతా దుర్గ హీరోయినే-దాని, మొగుడు మాత్రం హీరో కాదు

మొగుళ్లు చాలామంది హీరోలుకాదు.

కామందు లింట్లో మెక్కేసి దుర్గ 'సినిమాకు చెక్కేసినాది!

'తడక తోసేతరికి' గుడిసెలో నులక మంచం అడ్డొచ్చేసినాది-' దుర్గ మొగుడికి.

'లోన దీపవూనేదు. దీపంనాటి పిల్లా నేదు'.

'తిక్కలంజిముంతలు కడిగి బోర్లిం చీసి నాది.'

దాని మొగుడు బండీ లాగి లాగి రోజల్లా అరిచి వీధులన్నీ తిరిగి దుమ్ము కొట్టుకు పోయొచ్చాడు. కడుపులో పులి గ్రాండు మంటున్నది.

దానిచేతి ఎంగిలి మెతుకులు తిని దుక్కతన్నిన కుక్కలు తోకలాడించు గుంటూ వస్తే యీడ్చి డొక్కలో తన్ని మీ దిక్కున్న చోట చెప్పుకోండన్నాడు.

'గుంట కులుకుతూ వస్తాదేమో... కొగ్గటి కొప్పులో పూలెట్టి, చినీమా కులుకులన్నీ కులుకుతా దేవోం...యీడ్చి డొక్కలో తన్ని పీకుచ్చుకు గెంటాలి—' అని రోడ్డు కాశాడు. రిక్షాలు, చిన్న కారులు, జట్లు జట్లుగా జనం, సినీమా పూసులాడుకొంటూ విరగబడి నవ్వు కొంటూ వస్తున్నారు. 'తక్కుతూ తారుతూ కులుకుతా వస్తాదనుకున్న గుంట కంటికావడలేదు.'

'సర్'మని మొహంనిండా దుమ్ము రేపుతా హాఫీసరుగారి జీపు' దూసుకు పోయింది బాణంలా. దుర్గ ఆ జీపులో వెనకాల కూర్చోంది. అది వాడ్ని చూసింది. వాడివాలకం కనిపెట్టి అయ్యా గారికి చెప్పవలసిన నాలుగు ముక్కలూ చెప్పింది. అడిచేతులో వేపాటికర్ర వున్నా దండి. అమ్మగారూ అయ్యగారూ నవ్వు కున్నారు. అమ్మగారి చినిగిన సిలుక్కోక కట్టినా ఒది అమ్మగారికంటె హైక్లాసుగా వుంది. దుర్గ అతీన్ మణీలా, అది డైమాను రాణీ, ఇస్పేటాస్, తురుపుజాకీలాటిది. దుర్గ మొగుడు దారిలో మునిసిపల్ పంపు దగ్గర వొళ్లు కడుక్కుని పట్టినన్ని మంచి నీళ్లు తాగి తిరిగొచ్చేసరికి పెద్దయ్యగారి ప్యూను దొరగారు రమ్మన్నారంటూ యీడ్చుకెళ్ళాడు. ఏరా-దుర్గ మొగుడివి నువ్వేవా' అన్నా రయ్యగారు. 'సిత్తం' అన్నాడు.

'మరా గడ్డవేమిటి ఆ మీసా లేవిటి? తీయించెయ్—' అన్నారు దొరగారు.

'నౌఖరీ చేస్తావా, నైటువాచ రుద్యోగం-' అని రెట్టించారు.

'నీకు బండిలాగడం కష్ట మవుతున్నా దని పాపం దుర్గ చెప్పింది. అది మంచి పిల్లే..మాలక్ష్మిలాగుంటుంది. దాన్ని జాగ్రత్తగా చూచుకో-ఆ బనీనేవిటి? ఆ పంచేవిటి? బైతులాగ-ఒక పాంటూషర్టూ దుర్గ మొగుడికియ్యావే రేపు-అయితే నీ పేరేవిటన్నావ్ ?'

'బండిరావు లంటారండి.'

'బండిరావులూ - నువ్ వొళ్ళు దగ్గ రెట్టుకు నౌఖరీ చేసుకో-వెళ్లు. దాన్నే వనకు.' అని చెప్పేసి అయ్యగారు లోపలి కెళ్ళిపోయారు.

బండిరావులు గాలిలో తేలిపోతూ 'లల్లల్లా' అని పాడుకుంటూ గుడిసెదాపు కెళ్లేసరికి——

"హోరోలి నైట్ వాచ్ మన్" అంటూ దుర్గ ఎదురొచ్చి మెడను వాటేసుకుని ముద్దులు కురిపించేసినాది.

"వుండొదిలెశ్" అని సిగ్గుపడి పోయాడు బండిరాములు. సిల్వరు గిన్నెలో అన్నం కలుపుకునొచ్చి "తిను మావా" అని గోముగా బండీమీద కూర్చోని తెల్లని వెన్నెట్లో చినీమాలో హీరోయినీ అనిపించినట్లు ముద్దులుచేసి నోటి కందిచ్చింది. గెడ్డానికి అన్నం పట్టించి మూతిమీసాలులాగి పిల్ల చెడ్డ వుక్కిరిబిక్కిరి చేసేసింది. బనీను జోబీలు తడివి చిల్లరంతా లెక్కెట్టి బొడ్లోదోపు కుంది. నోట్లు మడిచి జాకెట్లో దాచింది. బండిరావుడి కడుపులో పులినిద్రపోయింది. చౌపాటికర్రచూర్లోంచి తొంగిచూస్తోంది. మినిట్లో పాకసర్ది నులకమంచం పర్చింది. మావనందులో కుదేసి నోట్లో చుట్ట పెట్టి అగ్గిపిల్ల గీసింది. పాకలో రాటనానుకుని ఆలోచిస్తా బొమ్మలా నిలబడిపోయింది దుర్గ.

"మరి నువ్వు గెడ్డంమీసం గీకించేసి దొరబాబులా లాగూ సొక్కవేస్తే నాను పోలిపట్టలేనుమావా" అని వాపోయింది.

* * *

మంచం క్రిందనున్న ట్రంకు పెట్టెను లాగి మంగళసూత్రంలోని తాళం చెవితో దాన్ని తెరిచి తెరిచిన పెట్టెముందు తెరుచు కున్న బ్రతుకుని తలపోస్తూ కూర్చుండి పోయింది పార్వతి.

ఆ కన్నవారిచ్చిన పెట్టెముందు సంతో షంతో కూర్చున్న క్షణాలు లేకపోలేదు. కాపురాని కొచ్చిన క్రొత్తలో పెట్టె సర్దుకుంటూ మధురమైన వూహల్లో తేలి పోతూ అంద రాడబడుచుల్లానే తానూ సుఖసంతోషాల సంసార స్వర్గానికి సోపా నాలు కట్టకపోలేదు పూలరథంలా వచ్చిన పార్వతి పుస్తెలతాడుతో పసుపుకొమ్ము మెళ్ళో కట్టుకునే స్థితికి దిగజారింది. ఏటా ఏటా కానుపులు, రోగాలూ రొచ్చులూ, ఎడనెడా పిల్లలూ, చాలీచాలని జీతం, గుమాస్తా మొగుడూ, మండిపోతున్న ధరలూ జీవితం లుంగలుచుట్టుకుపోతోంది. రేపెల్లాగడుస్తుం దనే భయం బ్రతుకుల్ని దిగ లాగేస్తోంది.

ఈ పెట్టెలోంచే వెళ్ళినాడు పది

మందిలో ఘనంగా పెట్టిన వెండికంచం, పెద్ద వెండిగ్లాసు, తమలపాకుల పళ్ళెం, వెండి తామరాకు అన్నీ కాళ్ళు వచ్చినట్లు ఎటో నడిచివెళ్ళేయి. వెళ్ళేయమ్మా వెళ్ళేయి.

ఇప్పుడు మిగిలిందల్లా పాతికతులాల వెండి పన్నీరుబుడ్డి-జీవితంమీద పన్నీరు చిలుకుతుందనుకున్న యీ ఒక్క వస్తువా కాళ్ళొచ్చి మార్వాడీవాడి కొట్లోకి నడిచి వెళ్ళవలసిందేనా అనిపించి పెట్టెముందు కూర్చుని భోరున ఏడ్చేసింది. ఇక తర్వాత గంధపుగిన్నె, వక్కపొడిభరిణ, కుంకుం భరిణి-ఆ బొట్టు పెట్టెను వొళ్ళో పెట్టుకుని తల్చుకుని తల్చుకుని ఏడ్చేసి భళ్ళున తెరుచుకున్న ఆ దిక్కుమాలిన పెట్టెకేసి గుడ్లప్పగించి దీనంగ మాస్తూండిపోయింది.

పిల్లలు లేస్తే ఆకలి ఆకలి అంటూ పిరుచుకుపడతారు. ఈ పూటైనా కనికరించి పాలవాడు పాలుపోస్తే వుంది. చప్పున పెట్టెమూత వేసేసి పన్నీరుబుడ్డీ చేత్తోపుచ్చుకు లేచి దాని కో కాగితం చుట్టి సంచీలో పెట్టి సిద్ధంచేసింది.

అప్పుడే 'అమ్మగారూ! అమ్మగారూ!' అంటూ దుర్గ తలుపుమీద దబదబా బాత్తోంది. పార్వతి చెంగుతో కళ్లు తుడుచుకుని తలుపు ఓరవాకిలిగా తీసి ఏవన్నట్లు నిలబడింది.

దాని మొహంలో ఎక్కడా బ్రతుకు భయం లేదు. దాన్ని చూస్తే పచ్చని చెట్టును చూసిన సంతోషం కలుగుతున్నది. తమకు జీవితం శాపంగా పరిణమిస్తే దానికది వరమై కూర్చుంది.

'అదేం టమ్మగారూ ఆ పన్నీరుబుడ్డి చేత్తోపట్టుకు నిలబడ్డారూ? అయ్యగారిమీద జల్లుతారా?' అని నవ్విందది.

పార్వతి ఉలిక్కిపడి 'ఏం లేదే-కాస్త మెరుగు పెట్టిద్దావని...' అని నసిగేసింది.

'అమ్మగోరూ మావోడు నైట్ వోచిమనై పోనాడండీ. మరిక బండి నాగడు.' అని గునిసింది.



'అదేవిటే వెర్రి మొహామా? వాడు నైట్ వాచిమనైతే నువ్వొక్కత్తివీ ఎలా గుంటావే రాత్రిళ్లు?' అని పార్వతి ఎదురుప్రశ్న వేసింది.

'నైటు వోచిమనైతే రాత్తిళ్ళు మరి గింటికి రాడేటండమ్మగోరూ ?'

'రాడే పిచ్చిమొద్దూ-'

'వోరి నాయనో—మరైతే మావోడికి నైటు వాచిమ నొద్దని బండీలాక్కోమని చెప్పండమ్మగోరూ?' అని అది గాబరా పడిపోయింది. పార్వతికి దాని గాబరా చూస్తే జాలేసింది. అది కంగారుగా జాకెట్లోంచి మడిచిన నోట్లు తీసి 'యియి దాచిపెట్టం డమ్మగోరూ' అని పారిపోయింది.

పార్వతికి ఆ నోట్లను అందుకోవడానికి చేతులు వణికాయి. లెక్కపెట్టింది. పదహారు రూపాయలున్నాయి. బొడ్లోంచి చిల్లర తీసింది. పావలాలు, అర్ధలు, పది పైసల బిళ్ళలూ అంతాకలిపి ఐదురూపాయల పావలా-చెంగున మరో మూటుంది. అందులో ఒకరూపాయిబిళ్ళ, ఒక నలిగిన రూపాయినోటు, ఒక పావలా, ఐదు పది పైసల బిళ్ళలూ వున్నాయి. ఆ రెండు ముప్పావలా చేతిలో వుంచుకోవాలిట నిత్యకృత్యానికి...

"మళ్ళీ ఎప్పు డిమ్మంటావే-" అశ

...తామా హతః కుంజరః అన్నట్లడిగింది.

"పండక్కి కోక కొని పెట్టండమ్మ ...గారూ! అని ముద్దుగా అడిగిందది.

"నీ మొగుడు నైట్ వాచిమనైతే ...కేంలోచే-" అని పార్వతి దాని కళ్ళ ...లోకి చూసి నవ్వింది.

"ఓరిబాబో నాకొద్దండీ" అని పిలుస్తున్నా మాట వినిపించుకోకుండా దుర్గ ...రోడ్డుమీదకు పరిగెత్తింది.

పరిగెట్టు కెళ్ళి గుడిసెలో మొగుడి ...కాళ్లోవాలి వలవలా ఏడ్చిందది. వాడి మెడను వాటేసుకుని గుండెలమీద తల వాల్చి "కొంప మునిగిపోనాదిరో" అని ...గోలెత్తింది.

"ఏటి నీబాద దురిగే నా దురిగే" అనివాడు దాని వొళ్లంతా నిమిరి బుజ్జగించాడు.

"నా కొంప కగ్గెట్టేసుకున్నావ్రో మావా" అని గొడవచేసింది.

సెప్పే-ఏటాగోల?" అని చికాగ్గా బండిరాముడు అరిచాడు.

"నీకు నైట్ వాచీమన్ వొద్దురా-మావా నువ్ బండీయే లాక్కోరా మావా! నా మాటిను..."

"ఇదేటే-మళ్ళీ-ఇదో పేశీ?"

"పద-పద-అయ్యగోర్ని అడిగేద్దాం" అని వీధిలోకి పరిగెట్టిందది దట్టించిన తారాజువ్వలాగ; బండిరాముడు అయోమయంగా పెళ్ళాన్ని అనుసరించేడు చేసేదిలేక.

దుర్గ బుంగమూతిపెట్టి నిల్చుంది. అయ్యగారు కాఫీ తాగుతూ పేపరు చూస్తూ మధ్యమధ్య రేడియో వింటున్నారు. అమ్మగారు వరండాలో కొచ్చి 'ఏవిటే తగూ? మళ్ళీ వొచ్చా' వంది. అయ్యగారు కళ్ళజోడులోంచి పేపరు చూశారు ఏవిటి కథ అన్నట్లు. చేపాటి కర్రను గడ్డానికి తాటించి పెళ్ళాం వెనక నిలబడ్డాడు బండిరాముడు.

'మావోడు నైటు వాచీమనీసైడండీ' అని కచ్చితంగా చెప్పేసింది దుర్గ.

'ఏ వొచ్చింది?' అనిఆఫీసరు దంపతులు ఆశ్చర్యంగా అడిగారు.

'నైటు వాచీమనంటె రాత్తిర్లు గుడిసెకు రాట్టకదండీ—'

'అవును.'

'మరట్టైతే నానొంటిగుండ లేనండి' అని అక్కడ నిల్చోకుండా వెనక్కు తిరిగి చకచక పిర్రలాడించుగుంటూ వచ్చేసింది.

ఆఫీసరుగారు దానిపొగరు దానిషోకు దాని వయ్యారం అంతా చూస్తూ పగలబడి నవ్వుకుని అర్థాంగితో యిలా వ్యాఖ్యానించారు. 'చూశావా లిండ్జరు ప్రభువు అర్థాంగికోసం సామ్రాజ్యాన్నే అక్కర్లేదనేశాడు. బండిరాముడు మటుకు తీసిపోయాడనుకున్నావా? పెళ్లాంకోసం నైట్ వాచ్‌మన్‌గిరీ కాల తన్నేశాడు.'

రోడ్డుమీద విసవిసా నడిచిపోతున్న ఆ జంటకేసి రెప్పవాల్చకుండా చూసి అదృష్టవంతులు అని ఆఫీసరు దంపతులు ఒకరి మొహంలో కొకరు చూసుకుని తలలు దించేసుకున్నారు.

రోడ్డుమీద ఎండ బంగారంలా పర్చుకుంది.

* * *

పెళ్ళికి రమ్మనమని కృష్ణారావు పాతిక రూపాయలు టి. యం. వో చేశాడు. ఆ నోట్లు సుబ్బారావు చేతిలోంచి లాక్కుని 'పెళ్ళి సంగతి తరవాత చూద్దాం-ముందు ఎలక్ట్రి బిల్లు కట్టేయండి' అంది పార్వతి. ఈ రాత్రయినా యింట్లో దీపాలు వెలగాలి తప్పదు - అని ఆవిడ ఉద్దేశం.

నిన్నరాత్రి అనుభవించిన యమయాతనను నరకాన్ని మళ్ళీ మళ్ళీ అనుభవించేందుకు తనూ తన పిల్లలూ సిద్ధంగా లేరు.

సుబ్బారావు తెల్లపోయాడు. ఈ కుచేలుడి పెళ్ళికే వెనక కృష్ణారావు రిస్టువాచీ కొనిపెట్టేడు. అది తాకట్టు పెట్టయినా రెండు డన్‌లప్ పిల్లోలు కొనిపట్టుకెళ్ళి పెళ్ళిలో చదివించాలనుకున్నాడు సుబ్బారావు.

హోటల్నుంచి రూపాయి ఇడ్లెన్లు తెప్పించింది "దుర్గ" చేత. పిల్లలంతా ఆనందంగా గెంతుకుంటూ తింటూంటే-సుబ్బారావు దిగాలుపడి బితుకూ బితుకూ చూస్తూంటే పార్వతి గరిట చేత్తోపట్టుకుని తనకు తాను మహా సంకల్పం చెప్పుకుంది.

నేనూ నా మొగుడూ నా సంసారం పచ్చగా వుండాలి. నా పసుపుకుంకుమా, నా మొగుడూ పిల్లలూ చల్లగా వుండడం కోసం, నా బ్రతుకు పచ్చగా వెళ్ళమారడంకోసం నే నేమైనా చేస్తాను. నా మొగుడ్ని నా కొంగుకు కట్టుకు తిరుగుతాను. నా ప్రాణంమీద కొచ్చినప్పుడు నాకు న్యాయంలేదు - అన్యాయంలేదు, ధర్మంలేదు అధర్మంలేదు.

సుబ్బారావుని టి. ఏ. బిల్సు మూటకట్టి మూలపారేమంది. ఒకరోజు సెలవు పెట్టండని హుకుం జారీచేసింది. సుబ్బారావు ఏవిటో గొణుక్కుంటూంటే—

'మీ రెళ్ళకపోతే అక్కడేమీ పెళ్ళి ఆగిపోదులెండి' అని చిత్రంగా కళ్ళు తిప్పింది.

సంచీ చేతికిచ్చి ఓ పది పదిహేను రూపాయలు పారేసి ముఖ్యంగా కావలసిన బియ్యం, ఉప్పూ, పప్పూ అన్నీ లిస్టురాసి యిచ్చి ఆ చేత్తో మార్కెట్టు నుంచి కూరలు కూడా తెమ్మంది.

స్తబ్దుగా బిగుసుకు నిలబడిపోయిన సంసార చక్రానికి చైతన్యాన్ని జోడించి దారిద్ర్యపు ఛాయల్ని తన సంసారం పొలిమేరలను త్రొక్కనివ్వకుండా తరిమికొట్టాలని కత్తిపట్టినట్లుంది పార్వతి.

పిల్లలకు స్నానాలు చేయించి ఇంట్లో ఉతికినబట్టలు వేసి చాపమీద తను సెంటర్లో కూర్చుని చుట్టూ వాళ్ళను కూర్చోపెట్టుకుని తలలు దువ్వి పవుడర్లు రాసి ముస్తాబు పూర్తి చేసింది.

బజార్నుంచి సుబ్బారావు తిరిగిరాగానే కణకణలాడుతున్న కుంపటిమీదకు అత్తిస

రెక్కించి కత్తిపీట ముందేసుకు కూర్చుంది. అమ్మకేసి వంటయింటికేసి పిల్లలు ఆసక్తిగా సంతోషంగా చూస్తున్నారు.

పచ్చిమిరపకాయ అల్లం నూరి కొత్తిమేర కారంవేసి వంకాయకూర చేసింది. పప్పుచేసి చారుపెట్టింది. నంజుకుందుకు కొత్త చింతకాయపచ్చడి తొక్కింది. అన్నం మల్లెపువ్వులాగుంది. పిల్లలు ఓపట్టు పట్టారు. సుబ్బారావు కంచం ఊడ్చేసాడు.

చారుమెతుకులే - పప్పూ కూరా అన్నవేం-నీళ్ళు కలిపి నిమ్మకాయపిండిన మజ్జిగే-ఆ గాజుల చేతిగలగలల మహత్మ్యమో, ఆ వంటరుచే అంతో తెలీలేదు. ఆ విందు రుచి ఏ పంచభక్ష్య పరమాన్నాలకూ తీసిపోదని సుబ్బారావు అనుకున్నాడు. దేశంనిండా సుబ్బారావులే-సుబ్బారావులకి లోటుండదేమో గాని పార్వతులకు లోటు ఉండితీరుతుంది.

గూట్లో దాచిపెట్టిన తాంబూలం మొగుడి చేతికిచ్చింది. తను భోజనం చేసి చీర మార్చుకుని కొప్పుముడి వదులుచేసి జడ అల్లుకుంటూ అద్దంముందు కూర్చుంది.

సుబ్బారావు మడతమంచాన్ని ప్రేమిస్తాడు. సుష్టుగా భోంచేసి అలసిపోయిన శరీరాన్ని సుఖంగా మడతమంచం మీదకు జారేసి వొళ్లు మరిచి గుర్రుపెట్టి నిద్రపోయాడు.

పిల్లలు పెరట్లోకిపోయి ఆడుకొంటున్నారు. పార్వతి లేచి ఇల్లంతా మరోమారు అక్కడి దిక్కడా యిక్కడి దక్కడా సర్ది కొంపని ఓ రూపానికి లాక్కొచ్చింది.

*　　　*　　　*

సుబ్బారావు పార్వతికి టోకరా తినిపించి లారీమీదెక్కి కృష్ణారావు పెళ్ళికి హాజరయాడు. లారీమీంచి దిగిన సుబ్బారావుని కారుల్లోంచి దిగిన చుట్టాలకి స్వయంగా పరిచయంచేశాడు. పార్వతినీ పిల్లలనూ తీసుకురాలేదేమని కృష్ణారావు డబాయించాడు. మంగల్ని పిలిచి, సుబ్బారావుకి తలంటమన్నాడు. 'వద్దురా బాబో' అన్నా-వినిపించుగోకుండా గ్లాస్గో పంచెల చాపుపెట్టి-తన టెర్లిన్ చొక్కాఓటిచ్చి తొడిగించి విడిదిలో తన పక్కన కూర్చోపెట్టుకున్నాడు. రాత్రి ఒంటిగంట దాటాక ముహూర్తం. పెళ్ళికూతురు యమ్మేట-యీ పెళ్ళి కాస్తా అయిపోగానే ఇద్దరూ ఏ అమెరికా చెక్కేస్తారో! లవ్ మ్యారేజీయే నని చెప్పాడు వాడు.

'పెళ్ళికూతుర్ని చూస్తా వేమిట్రా-' అని ముసిముసిగా నవ్వాడు.

'ముహూర్తం వేళకి చూస్తాగా-' అని మర్యాదగా జవాబిచ్చాడు సుబ్బారావు.

'రద్దూ - నీ పేరు చెప్పుకుని నేనో మాటు.'


'జానీ'ని చూద్దావని' అని రెక్కపట్టుకు యీడ్చుకెళ్ళాడు బలవంతాన.

'జానీ' అంటే జానకికి ముద్దుపేరుట -

'కొత్తపెళ్ళికూతుర్ని చూడనిస్తారా?' అని సందేహంగా అడిగాడు సుబ్బారావు.

'రేపటికి పాతబడిపోకుండా ఇప్పుడే చూద్దాం' అని వేళాకోళమాడాడు.

రేపట్నుంచి పెళ్ళాం కాబోతున్నది కాబట్టి ప్రేయసిగా వుండగా ఒకసారి చూద్దామనే వింతకోర్కె కృష్ణారావులో కలిగింది.




సుబ్బారావుకి తనపెళ్లాం అందమైనదో కాదో అన్న ఆలోచన ఎప్పుడు రాలేదు. జ్ఞాపకం చేసుకుందామనుకున్నా పార్వతి మొహం చప్పునగుర్తుకు రావడంలేదు. మనసు సరిపెట్టుకుని అవసరాల బలంతో దాంపత్యజీవితానికే నెట్టుకు రావడం జరుగుతోంది. కాని పెళ్ళాం మొహంలో సౌందర్యం వుందో లేదో యిప్పుడు వెతుక్కోవడం మొదలెడితే యీ ప్రశ్నకు జవాబులేదు. ఒకప్పుడు వుండేదేమో - వుంటే అది కాలక్రమాన కరిగిపోయి వుండొచ్చు. కొంపలో దరిద్రం తాండవమాడుతుంటే భయం బ్రతుకుల్ని వెంటాడి వేటాడుతూంటే ఇంకెక్కడి సౌందర్యం - అది హుష్ కాకీ అని ఎగిరి చక్కాపోయి ఉంటుంది, ఎక్కడికో - పార్వతి అందమంతా ఎక్కడికీ పారిపోలేదు. అమృతం పంచిపెట్టినట్లు తనచక్కదనాన్ని తనపిల్లలుకు పంచియిచ్చేసింది. ఆ పిల్లలు మూడుపూట్లా తిండితిని బ్రతికి బట్టకడితే వారి మొహాలలో దోబూచులాడే సొగసులూ సోయ

గాలూ ఎక్కడివి? పార్వతివి కావా - జానీ నిజంగా అమృతభాండం చేతధరించి నిలబడ్డ జగన్మోహినిలావుంది అనుకున్నాడు సుబ్బారావు.

'మా సుబ్బారావుకి నిన్ను చూపిద్దామనీ, అని నవ్వేడు కృష్ణారావు.

పెళ్ళికూతురి చుట్టూ చాలా మంది ఆడాళ్ళున్నారు. వాళ్ళందరూ ఖాళీ గాజుసీసాల్లా గున్నారు. అవన్నీ చప్పుడు చేసుగుంటూ గలగలా నవ్వేయి. సుబ్బారావు సిగ్గుపడిపోయాడు.

కృష్ణారావు చిన్న చీటీమడిచి జానకి వొళ్ళోపడేలా విసిరి సుబ్బారావుని తీసుకుని గబగబా బయటికి వచ్చి విరగబడి నవ్వాడు.

'ఎందుకు రా అల్లా నవ్వుతావు?'

'చెప్పుకో-'

'నా కెలా తెలుస్తుంది?'

'జానకి లవ్ లెటర్ రాశావు-'

'చాల్లే వేళాకోళం - ఇప్పుడా?'

'ఇదే మా ఆఖరి ప్రేమలేఖ-'

'నోర్మూయ్.'

'రేపట్నుంచీ రాసుకునే ఉత్తరాల్ని లవ్ లెటర్సు అనరోయ్-'

'అసందర్భంగా ఏ వైనా రాసి ఆ పిల్లను ఏడిపిస్తున్నావా?' అని సంసారపక్షంగా మందలించాడు సుబ్బారావు.

'జానీ' మూడ్ 'సెట్ చేశాన్రా పెళ్ళికి ముందు.'

'నువ్వు సెట్ చేసేదేవిటి? పెళ్ళికూతుర్ని చేసినప్పట్నుంచీ ఆ అమ్మాయి పెళ్ళి మూడ్ లోనే వుంటుంది.'

'అది కాదు రా బ్రదర్ - ముచ్చటగా మూడేముక్కలు రాశాన్రా-'

'దట్సాల్! నాకు చెప్పకు.'

కృష్ణారావు మళ్ళీ నవ్వడం మొదలెట్టాడు.

విడిదినుండి విందుకు పిలుపు వచ్చింది. కృష్ణారావు సుబ్బారావుని పట్టుకు వదలడంలేదు ఈ అబ్బాయికి పెళ్ళి చేయడం శుద్ధ దండగ అనిపించేలా ప్రవర్తిస్తున్నాడు. పెళ్ళికొడుకు విందులో సుబ్బారావుని పక్కన కూర్చో పెట్టుకున్నాడు.

సుబ్బారావుకి కళ్ళు చెదిరిపోయాయి, గొప్పవారింట్లో జరిగే పెళ్ళి విందు ఎలా గుండాలో అలావుంది. స్వీట్లు హాట్లు ఎన్నో పదార్థాలువున్నా ముద్ద నోటికి దిగడంలేదు. అన్నంముట్టుగుంటే సెనగల పళ్ళెం మంచినీళ్ళ గ్లాసుతో ఎదురుగుండా పార్వతి నిలబడ్డది. అక్కడ వాళ్ళేం తింటున్నారో - తినడానికి వుందో లేదో - యీ లడ్లు మిఠాయిలు పూరీలు యివన్నీ పాపం వాళ్ళకెంతో యిష్టం. యీ విస్తరి యిలా మూటకట్టుకుని లారీలో యింటికి పారిపోతే-గటగటా మంచినీళ్లు తాగేశాడు.

'నువ్ భోజనం సరిగా చేయడంలేదు' అని విసుక్కుంటూ తలెత్తి సుబ్బారావు మొహంలోకి చూశాడు. చూసి నిర్ఘాంతపోయాడు.

సుబ్బారావు ఏడుస్తున్నట్లున్నాడు.

"యూ స్టుపిడ్ వాటీజ్ దిస్——"

సుబ్బారావు మొహం పక్కకు తిప్పుకున్నాడు, పార్వతి చేత్తో వడ్డిస్తే చింతకాయపచ్చడి చారూ మెతుకుల్తో కంచం వూడ్చేసిన సుబ్బారావు పరీక్ష హాల్లో ఒక్క కొశ్చన్ కూడా ఆన్సరు చేయలేక దిగులుగా ప్రశ్నాపత్రంకేసి చూసే కుర్రాడిలా వున్నాడు.

కృష్ణారావు "ఏమైందిరా——" అని రెట్టించాడు.

"నీ పెళ్ళికి నేనేమీ కానుక తెచ్చి యివ్వలేక పోయానురా" అని తలొంచుకుని అబద్ధం ఆడేశాడు.

"యూ స్టుపిడ్-పటవ్" అని నా లవ్ లెటర్లో ఏంవ్రాశానో చెప్పమంటావా? అని అడిగాడు కృష్ణారావు.

"చెప్పు! చెప్పు!" అని సుబ్బారావు "తడియారని కన్నవతో" ఆత్రుతగా చూశాడు.

"జానీ! నాముద్దు ప్రేయసీ - ఒక వాక్యం అయిందా?"

"అయింది."

"రేపటినుంచి నువ్వు నా గృహిణివి కాబోతున్నావు."

"రెండు."

"నా ముద్దు ప్రేయసికి యిదేనా కడసారి వీడ్కోలు."

"డామిట్! కడసారి అని ఎందుకు రాసేవురా?"

"రేపట్నుంచీ పెళ్లాం ప్రేయసికాదు"

సుబ్బారావు నవ్వాడు. ఇంతలో చారువస్తే చారుపోయించుకుని గుప్పెడు మెతుకులు తిన్నాడు. కృష్ణారావు స్నేహితుడ్ని నవ్వించానని సంతోషించాడు. చారు అన్నం తింటూన్నప్పుడూ పార్వతి నవ్వు మొహంతో నిలబడినట్లుతోచింది.

"మీ దంపతు లిద్దరూ మా యింటికి రావాలిరా——" అని అభ్యర్థించాడు సుబ్బారావు.

"నువ్వు పిలిచినా పిలవక పోయినా మీ యింటికివచ్చి భోజనంచేసి మరీ వెళ్తాం సరేనా" అని హామీ యిచ్చాడు కృష్ణారావు. సుబ్బారావు ఆలోచిస్తూ "రిప్లయి వస్తే నాకు చూపించు" అన్నాడు.

"దేనికి?" అన్నాడు కృష్ణారావు.

"ఇందాకటి నువ్ రాసిన లవ్ లెటర్ కి."

"అది వుట్టి తెల్లకాగితం ముక్కే?"

"ఏవిటి?"

"నిన్ను హ్యూమర్ చేయడాని కల్లా చెప్పాను."

సుబ్బారావు తెలపోయాడు.

* * *

సరిగ్గా పదేళ్లు-పదేళ్ళ తర్వాత ఢిల్లీలో సుబ్బారావు అండ్ కో ని వెతుక్కుంటూ

ర్గ, కృష్ణారావు, కృష్ణారావుతో మరో ంగారు పిచిక టాక్సీలోంచి దిగారు.

పిల్లలా ? జానీ క్షేమమా - అంతా లాసా అని తెలుగు ప్రశ్నలు వేసేడు బ్బారావు. పార్వతి గౌరవ అతిథుల్ని కటిన్నరగది వాటాలోకి ఆహ్వానించి ంచాలమీద కూర్చోపెట్టింది.

అమ్మగారూ నన్ను పోల్చుకోలేదా ని దుర్గ పార్వతిని సవాలు చేసేవరకూ ార్వతికి వూహా కందలేదు.

'నువ్వెలా గొచ్చావే?' అంటూ తెల్ల ోయి 'మరి నీ మొగుడో...' అని నెమ్మ గా అడిగింది. దుర్గ పార్వతిని కౌగిలించు న్నంత పన్జేసి 'అమ్మగోరూ' అంటూ ట్టుకువదల్లేదు. దుర్గ ఎలక్షన్లలో పని సిందట. కృష్ణారావు దొరబాబల్లే న్నాడు కాని చిన్న బట్టతల వచ్చే ాచనలు కనిపిస్తున్నాయి.

'కౌసల్యాదేవి రాజ్యసభ మెంబరు. యూజ్ మై బాస్' అని పరిచయం సేడు పార్వతికి సుబ్బారావుకి.

కౌసల్యాదేవి చామనఛాయ రంగు. పెద్ద పెద్ద కళ్ళు ఖద్దరుచీర కట్టుకుని చాలా ంపుల్ గా ఉంది. జమీందారు బిడ్డలా దు. చాలా సంసార పక్షంగా చల్లగా యగా మాట్లాడింది. పార్వతి బెదిరి ోకుండా మచ్చిక చేసుగుని పిల్లలగురించీ రలగురించీ, పళ్ళు, తెలుగు భోజనం రించి మాట్లాడేసింది. దుర్గని తనతో ల్లీ తీసుకువచ్చేసిందట-ఆడతోడుకోసం. ార్వతిని సుబ్బారావుని పిల్లల్ని తనతో చ్చి ఉండమంది నాలుగురోజులు. తన ంగళాలో-తన కేమీ తోచడంలేదని ప్పింది. కృష్ణారావు బలవంతంచేసిన దట రెండు మీరా భజన కీర్తనలు మోఘంగా పాడి వినిపించింది. సుబ్బా ావు కౌసల్య కృష్ణారావు మంచాలమీద ార్చుని 'టీ' త్రాగుతూ పేక ఆడు న్నారు.



జానీ గురించి అడిగితే చెప్తాన్చెప్తా న్తరవాత చెప్తానని తప్పించుగున్నాడు. సుబ్బారావు తనకు ఏడుగురు పిల్లలనీ-ముగ్గురు ఆడ-నలుగురు మగా అని నిట్టూరుస్తూ చెప్పేడు. ఉద్యోగం ఎదగూ బొదుగూలేదని ఢిల్లీ ట్రాన్స్ఫర్ చేస్తే ఐదుగుర్ని దేశంలో పెద్దవాళ్ళ దగ్గర వదిలేసి ఇద్దరు పిల్లల్తో ఢిల్లీ వచ్చిపడ్డా మని స్వగతం చెప్పుకున్నాడు.

కౌసల్యాదేవిని దుర్గని కృష్ణారావుని పార్వతి భోంచేసి వెళ్ళమని ఆపుజేసింది.

నెల్లూరు బియ్యంతో మల్లెపువ్వులాగ అన్నం వండి వార్చింది. బెండకాయ వేపుడు, మజ్జిగపులుసు, కొరివికారం, గోంగూరపచ్చడి చారూ వేసి పెట్టింది. అసలు సిసలైన తెలుగుభోజనం చేసి చాలా రోజు లయిందని పార్వతి చేతివంటను తెగ మెచ్చుకుంటూ ముగ్గురూ కంచాలు ఖాళీచేశారు.

గుమాస్తా పెళ్లాం పార్వతి రాజ్యసభ మెంబరు కౌసల్యా మంచి ఫ్రండ్సయారు. ముగ్గురూ మూడు మంచాల మీదా కూర్చుని రాత్రి అంతా కబుర్లు చెప్పుగుంటూ గడిపేశారు. పార్వతి వరండాలో చాపేసుకుని పిల్లల్ని పక్కలో వేసుకుని దుర్గతో మాట్లాడుతూ పడుకుంది.

'ఈ అమ్మగార్ని ఆ అబ్బాయిగారు ప్రేమించారు' అని రహస్యంగా చెప్పింది.

'నీ మొహం యీడ్చా - ఆయనకు పెళ్ళయింది కదే?'

'అవునమ్మా-ఆ యమ్మకు చేయెత్తి మొక్కాలి. ఈ ళ్ళిద్దరికీ ఇక్కడ పడి ఏడవమని పర్మిసనిచ్చేసింది ఆ యమ్మ.'

'మరి యీావి డింత చదువుకుంది, పెద్ద హోదా, గొప్పింటిబిడ్డ కదా, సాటి ఆడ దాని పీక కొయ్యటం తప్పని తెలీదూ?'

'అబ్బో-తెలీకేం అక్కా అక్కా అంటూ యీావిడే ఆవిడ్ని మంచి చేసుకుని యీా అబ్బాయిగారితో గదిలో చేరి కులికేది. ఆ యమ్మ వంటింట్లో చాపేసుకుని గడప మీద తల వాల్చుకు పడుకునేది.

'ఇది చాలా చిత్రంగా వుందే! మొగుడ్ని ఏ ఆడదైనా యిలా దానం చేస్తుందా?'

'ఆ బాబు మరిక నాయమ్మను ఏలు కోడు - యీా యమ్మకు అంటుడులా గయిపోయాడు.'

పార్వతి గుండెలు వేగంగా కొట్టు కున్నాయి.

'అంతలా అంటుకు తిరిగేదానివి. నీ మొగుడ్ని నీ వేం చేసేవే ... వొదిలీ వేసేవా?'

'ఆ డక్కడ నా నిక్కడ - ఈ యమ్మ ఢిల్లీ కొచ్చినప్పు డల్లా నా కీ పాట్లు తప్పవు అని దుర్గ వాపోయింది. ఎందుకైనా మంచిది, తనమొగుడ్ని కాస్త జాగర్తగా కాసుకోవాలి. కాని అంతలోనే నవ్వొచ్చింది పార్వతికి - సుబ్బారావు ఎవరికాక్కావాలి?

'మరి యీా విషయం ఆ వూళ్లో అందరికీ తెలుసా?'

'అంతా దొంగచాటు బ్రతుకే - ఈ యమ్మ కీనంటే ప్రాణం!'

పార్వతి నవ్వుకుంది.

'పెళ్ళి కాకుండా గొడవల్లోపడితే చెడ్డ అవస్థమ్మా - అంతా నవ్వుతారు సాటుగా మాటుగా, మొహంమీద ఏ వంటారు?'

కౌసల్యా దేవికంటె తనబ్రతుకు ఎన్నిరెట్లు మెరుగో పార్వతికి తెలిసివచ్చింది. తన మొగుడికి ప్రేమాభామా కలాపమంతా తెలుసా? తెలిసే స్నేహితుడ్నేమన లేక తానే నోరుమూసుగుని కూర్చున్నారా? నీ పెళ్ళానికి అన్యాయంచేయకు అని మరోవ్యక్తిచేత చెప్పించుగునే స్థితిలో ఏ మొగాడైనా ఎందుకుండాలి? ఆవిడకు యితనికీ ఏమొచ్చాయో...ఎవరికి తెలును? ఏ మొచ్చినా చేసుకున్న పెళ్లాన్ని అంతలా నిర్దయగా వదిలేసి మరో ఆడదాని వెంటపడటం - ఛీ! ఈ మగజాతికే చెల్లింది. మొగుడిచేత నిరాదరింపబడిన ఆడదాని జీవితం అడక్కండి బాబూ, అంతకన్నా అడుక్కుతినడం మేలు. పార్వతికి ఏడుపొచ్చింది. కళ్లు తుడుచుకుని పిల్లలమీద చేయివేసుకు కునికింది.

* * *

ఆర్నెల్లనాడు -

సుబ్బారావుకి మళ్ళీ కృష్ణపక్షం ఎదురయింది. పన్నీరుబుడ్డి రంగు కాగితంలో చుట్టి చాందినీ చౌకులోని వెండి దుకాణాలలోకి జొరబడ్డాడు. పార్వతి పచారీ సరుకుల కొట్టువాడిని పదిరూపాయల సరుకు నిమ్మని బ్రతిమాలింది. కాని వాడు పాతబాకి చెల్లించి సరుకులు పట్టికెళ్ళండి అని భీష్మించుకు కూర్చున్నాడు. రెండు బన్‌రొట్టెలు చిత్తుకాగితా లమ్మిన డబ్బుల్తోకొని తన ఒకటిన్నర గది నివాసాని కొచ్చేసరికి శుభలేఖ కిటికీలోంచి పడేసివుంది. తనకు వచ్చీ రాని ఇంగ్లీషులో కూడబలుక్కుని చదివింది. గుండె ఝల్లుమంది. అది కృష్ణారావు కౌసల్యాదేవిల పెళ్ళి శుభలేఖ. అయితే కృష్ణారావు జానకీ విడాకు లిచ్చేశాడన్నమాట. ఈ మొగుడొద్దు యీా కాపుర మొద్దు అని ఆ అమ్మాయిచేత అనిపించేశా రన్నమాట. రామరామ! నారాయణ! నారాయణ! ఘోరకలి జరిగిపోతోంది - ఆ ఏడ్చే యేడుపేదో యిద్దర్నీ పెట్టుకు ఏడవకూడదా? వుంచుకున్నాడు. వాడితో పోతోంది అనే స్టేటస్ యీావిడకు అప్పుడే వచ్చేసింది కాబోలు! పార్వతి టీ పెట్టి పిల్లలకు బన్‌రొట్టె కాల్చిపెట్టి మొగుడికోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

సుబ్బారావు ముప్ఫయి రూపాయల తెచ్చి పార్వతిచేతిలో పోశాడు. పార్వ మొహం జాజ్వల్యమానంగా వెలి పోతోంది.

'ఈ వేళ వంట చేయలేదా?'

'లేదు. మీకు పెళ్ళి భోజనం రడీగ వుంది. భోంచేసి మాక్కూడా యిన్ని మిఠాయిలు పట్రండి.'

'ఏఁవిటి నీ వేళాకోళం?'

'లారీలో కాని బస్సులో కాని నడి కాని వెళ్ళండి.'

ముహూర్తాని కింకా టైముంది.

'చంపుదూ చెప్పక-'

కౌసల్యాదేవి పెళ్ళి శుభలేఖ తెచ్చి యిచ్చింది పార్వతి.

సుబ్బారావు నిర్ఘాంతపోయాడు.

ఎంతపని చేశావురా - ఎంతపని చేశావురా?

జానీచేత మొత్తానికి విడాకు లిప్పించేశా వన్నమాట. నీ కిచ్చి ఆ పిల్ల గొంతు కోశాడు దానితండ్రి. తెల్లకాగితం మీ పడేసి అదే ప్రేమలేఖ అన్నవాడివి నువ్ ఎంతకైనా తగుదువు -- సిగ్గు లే పోతేసరి!

'ముఖ్య స్నేహితులేమో-పాపం మీ లేకుండా పెళ్లి జరిగిపోతుందేమో - వేగ వెళ్ళండి. అశోకాహోటల్లో డిన్నరుంది.

సుబ్బారావు మంచంమీద కూలబడి

'ప్రేయసీ నీ పేరు రాక్షసి అన్నా కవి. కృష్ణారావు కో రాక్షసి సంప్రా స్తున్నాది,' అని తలపట్టుకున్నాడు. ఇ రికీ శుభలేఖ శుభలేఖగాలేదు.

పార్వతి ముప్ఫయి రూపాయ తెచ్చి చేతిలోపోసినా లేచి బజారు కెళ లేకపోయింది. వంట చేయలేకపోయింది అవతల పెళ్ళి హోరుగా జరిగిపోతుం బన్ రొట్టతిని టీ చుక్కలుత్రాగి పార్వ సుబ్బారావులు అభోజనం పడుకున్నారు

ఎక్కడో కునుకుపోయిన మగువ తిం తినకుండా కంటికీ మంటికీ ఏకధారగ ఏడుస్తూ ఉండవచ్చు.